

# ఆదిలాబాద్ వార్త



**మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్**

**శనివారం 23, మే 2026**

### యూరియా వినియోగం తగ్గించి
## సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

**కాగజ్‌నగర్ రూరల్, మే 22, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని బోడేపల్లి గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంటల సాగు, నేల ఆరోగ్యం, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియా వినియోగించకుండా అవసరమైన మేరకే ఎరువులు ఉపయోగించాలని సూచించారు. సాగు మిగతా 2లో..

### కార్మికులకు అండగా..
# కాంగ్రెస్ ప్రభుత్వం



✻ కనీస వేతనాల పెంపుపై కాంగ్రెస్ నాయకుల హర్షం

✻ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ చిత్రపటాలకు పాలాభిషేకం

**మందమర్రి, మే 22, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలను మూడు జోన్ల వారీగా పెంచిన నేపథ్యంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బండి సదానందం యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి గోపతి భానేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి ఆకారం రమేష్, సీనియర్ నాయకుడు సొత్కు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, స్వర్గీయ కాకా గడ్డం వెంకటస్వామి నుంచి నేటి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ వరకు కార్మికుల పక్షాన నిలిచే కుటుంబంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. కార్మిక కుటుంబాలు తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు పెంచడం అభినందనీయమన్నారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, వేతనాల పెంపు సాధించిన ఘనత మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోట్లాది కార్మిక కుటుంబాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాయని అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ కార్మికులు సైతం ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మహిళా నాయకులు, మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కమ్యూనికేషన్ ఇన్‌చార్జ్‌లు, 24 వార్డుల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడటమే
## ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

✻ మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

✻ మంచిర్యాలలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**నస్పూర్, మే 22, ప్రభాతవార్త**

సీఎం సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 40,71,400 విలువైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి ఆయన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు ఈ నిధులు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ప్రేమ్‌సాగర్‌రావు మిగతా 2లో..



### చివరి గింజ వరకు
# కొనుగోలు చేస్తాం

★ అసత్య ప్రచారాలు రైతులు నమ్మవద్దు

★ మీడియా సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ రాములు



**చెన్నూరు, మే 22, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాములు తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం రోజున మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. వడ్ల కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని కొందరు చేస్తున్న ప్రచారాలను రైతులు నమ్మవద్దని సూచించారు. జిల్లాలో 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని భద్రపరిచే సామర్థ్యం గల గోదాములు ఉన్నాయని తెలిపారు. అదనంగా పెద్దపల్లి జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నులు, కరీంనగర్ జిల్లాలో మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరంలో ఇప్పటివరకు 87,825 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. లారీలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత లేదని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో హమాలీల కొరత ఉన్నా, బీహార్‌కు చెందిన కార్మికులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. తప్పుడు మిగతా 2లో..

## ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడటమే
# ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన బాధితులందరికీ ఈ పథకం ద్వారా లబ్ది చేకూర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. లబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, వివిధ వార్డుల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా వినియోగం తగ్గించి
# సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చులను తగ్గిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. రసాయనాల వినియోగాన్ని నియంత్రించి ప్రకృతిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవడంతో పాటు రైతులు సుస్థిర ఆదాయం పొందవచ్చని వివరించారు. మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాలనే సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని సూచించారు. సాగునీటిని ఆదా చేస్తూ భావితరాలకు సహజ వనరులను పరిరక్షించాలని రైతులకు తెలియజేశారు. అలాగే సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో రైతుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ భరత్ భూషణ్ రావు, డాక్టర్ డి శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సృజన, గ్రామ సర్పంచ్ కల్లేపల్లి రాజయ్య, ఉప సర్పంచ్ గడిల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ప్రోగ్రెసివ్ రైతు గడిల జగదీష్, ఎల్మ గోపాల్, రామ్ చందర్, సెండె బాబూరావు తదితర గ్రామ రైతులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారాలను నమ్మి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

## - జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్

నస్పూర్, మే 22, ప్రభాతవార్త

202627 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 తరగతి వార్షిక పరీక్షలలో 7.0 సి జీ.పి.ఎ. ఆపై మార్కులు సాధించి కార్పొరేట్ (ఇంటర్) కళాశాలలలో ప్రవేశం పొందగోరు జిల్లాకు చెందిన ఎస్.సి./ ఎస్.టి./ బి.సి./ మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఆన్ లైన్ లో www.telanganaepass.gov.in వెబ్ సైట్ లో ఈనెల 20వ తేదీ నుండి జూన్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 10వ తరగతి మెరిట్ ఆధారంగా సి.జి.జి. ద్వారా ప్రవేశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మీ సేవ నుండి పొందిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడి, 10వ తరగతిలో 7, ఆపైన గ్రేడ్ పాయింట్ (400 పైన) మార్కులు కలిగిన విద్యార్థులు మార్కుల మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బి.ఎ. ఎస్./ హెచ్.పి.ఎస్. విద్యార్థులు పాఠశాల/ సంబంధిత జిల్లా అధికారి ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలని, సి.బి.ఎస్.సి. విద్యార్థులు జిల్లా అధికారి ద్వారా 10వ తరగతి వివరాలు నమోదు చేసుకోవాలని, సర్టిఫికెట్ (4వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలంగాణలో చదివి ఉండాలి), వసతి గృహ బోనఫైడ్ సర్టిఫికెట్ (ప్రభుత్వ ఎస్. సి./ ఎస్.టి./ బి.సి. వసతి గృహ విద్యార్థులు మాత్రమే) కలిగి ఉండాలని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 22, ప్రభాతవార్త

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్న కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులలో నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండలం కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ తో కలిసి సందర్శించి ధాన్యం నిల్వ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు.

జైపూర్ మండలం ముదిగుంటలో గల బిఎస్‌వి. రైస్‌మిల్, ఇందారంలో గల వరలక్ష్మీ రైస్‌మిల్‌లను మండల తహసిల్దార్ వనజ రెడ్డితో కలిసి సందర్శించి ధాన్యం ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, లారీలు వేచి ఉండకుండా తిరిగి పంపించాలని, ఈ క్రమంలో అవసరమైన అమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. టేకుమట్లలో గల బాలాజీ గోదాం, కుందారంలో గల అన్నపూర్ణ రైస్ మిల్



గోదామును సందర్శించి ధాన్యం నిల్వ ప్రక్రియ త్వరగా ప్రారంభించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండల కేంద్రంలో గల గాయత్రి రైస్ మిల్ ను తహసిల్దార్ పుష్పలతతో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం ప్రక్రియ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సిఎంఆర్ లక్ష్యాలను వేగంగా పూర్తిచేసేలా రైస్ మిల్లుల యజమానులు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జేత్వాన్ బుద్ధ విహార్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి

వాంకిడి, మే 22, ప్రభాతవార్త :



వాంకిడి మండల కేంద్రం లోని జేత్వాన్ బుద్ధ విహార్ లో శుక్రవారం దళిత వైతాళికుడు, ఆదిఆంధ్ర సభ స్థాపకుడు, ఉమ్మడి రాష్ట్రంలో తొలి దళిత బాలికల పాఠశాలల స్థాపకులు భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లడుతూ భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మొట్టమొదటిగా దళిత ఉద్యమాన్ని నడిపిన తొలితరం దళిత ఉద్యమ నాయకుడు అని అన్నారు. చదువుకుంటేనే సమాజాన్ని బాగుపరవచ్చని 1906 నుండి 1933 మధ్యకాలంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 26 బాలికల పాఠశాలలను ఏర్పాటు చేసి దళిత పిల్లలకు విద్యను అందించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. అంబేద్కర్ను ఆదర్శంగా తీసుకున్న భాగ్యరెడ్డి వర్మ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి దళితుల హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘం మండల అధ్యక్షులు దుర్గం దుర్గాజీ,అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, సమతా సైనిక దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, శ్యామ్ రావు దుర్గే, సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షులు దీపక్ దుర్గే,నాయకులు దుర్గం మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ: టీయూడబ్ల్యూజే

నిర్మల్, మే 22, ప్రభాతవార్త:



నిర్మల్ జిల్లాలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయడమే ప్రభుత్వం, యూనియన్ ముఖ్య ఆశయమని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య స్పష్టం చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, యూనియన్ నాయకత్వ ఆధ్వర్యంలో జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొదటి విడత జాబితాలో కార్డులు రాని జర్నలిస్టులు ఎవరూ అధైర్యపడాల్సిన, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లోనే ప్రత్యేకంగా మరో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని మిగిలిన అర్హులైన వారికి రెండో విడత జాబితా ద్వారా కార్డులు ఇప్పిస్తామని పేర్కొన్నారు. కొందరి కార్డులను సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టారని, అంతేకాని ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. ప్రభుత్వంపై యూనియన్ నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చి, నిబంధనల్లో తగిన మార్పులు చేయిస్తూ అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు దక్కేలా విజయం సాధించిందని గుర్తుచేశారు. మొదటి జాబితాలో పేరు లేని మిత్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని, రెండో జాబితాలో కచ్చితంగా అర్హులైన వారికి కార్డుల పంపిణీ జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య, ఉపాధ్యక్షులు జల్ల మనోజ్, సభ్యులు డీఎస్ మధు, ప్రసాద్ జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు.

## నూటికి నూరు శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

### - ఐకె గ్రూప్ ఎండీటీ సమావేశంలో జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, మే 22, ప్రభాతవార్త



ఐకె 1ఎ గనిలో గత ఏడాది 84 శాతమే ఉత్పత్తి సాధించారు, ఈసారి నూటికి నూరు శాతం లక్ష్యాలు సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఐకె ఓసీ, ఐకె 1ఎ గ్రూప్‌తో పాటు ఏరియా వర్క్‌షాప్, స్టోర్ లలో ఐదో రోజు మల్టీ డిపార్ట్‌మెంటల్ (ఎండీటీ) సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఐకె గ్రూప్‌లో జరిగిన సమావేశానికి జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఐకె గ్రూప్‌లో ఐకె 1ఎ గని శ్రీరాంపూర్ ఏరియాలోనే కాకుండా మొత్తం సింగరేణిలోనే అత్యంత ఎక్కువ లైఫ్ ఉన్న భూగర్భ గని అని జనరల్ మేనేజర్ తెలిపారు. 2 సీమ్ సౌత్‌లో కొత్త డిస్ట్రిక్ట్, 3 సీమ్ లో మరో డిస్ట్రిక్ట్ ద్వారా ఎస్డీఎల్ యంత్రాలను పెంచుకొని, మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటేనే వంద శాతం ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. ఐకె ఓసీ విషయానికొస్తే 2020లో ప్రారంభమై మంచి ఉత్పత్తి సాధించినా, ఓబీ కాంట్రాక్ట్ సమస్యల కారణంగా గత ఏడాది వెనకబడిందని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రైవేట్ కాంట్రాక్ట్ లేనందున, ఇప్పటికే ఇతర ఓసీల నుంచి తెప్పించుకున్న షావల్స్, ఆపరేటర్ల ద్వారా ఉద్యోగులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి యంత్రాల పనిగంటలు పెంచాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఉత్పత్తి ఖర్చు తగ్గించుకొని నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తేనే సింగరేణి మనుగడ సాధ్యమని మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్ 1 కన్వీనర్, ఎస్టేటు జీఎం ఎన్. సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన సోలార్, విండ్ వైపు అడుగులు పడుతున్నా థర్మల్ విద్యుత్‌కు మరో యాభై ఏళ్ల ప్రాధాన్యత కొనసాగుతుందని సర్వేలు చెబుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో సంస్థ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల వినియోగం, నాణ్యత, రక్షణ, సంక్షేమంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య మాట్లాడుతూ, విధులు సరిగా నిర్వహించక ఉద్యోగాలు కోల్పోవద్దని హెచ్చరించారు. కారుణ్య నియామకాల ద్వారా ఎంతో ఆశతో ఉద్యోగాలు పొంది, అబ్సెంటీజం కారణంగా తల్లిదండ్రుల ఆత్మహత్యలకు కారణం కావద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు క్రమబద్ధంగా విధులకు హాజరవుతూ సంస్థ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. గనుల్లో ఉత్పత్తికి అవసరమైన మెటీరియల్స్, యంత్రాలు, టెక్నికల్ సపోర్టు అందించడంలో ఏరియా వర్క్‌షాప్, స్టోర్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీమ్ 2 కన్వీనర్, ఆర్.కె 7 గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్ కోరారు. ఈ సమావేశాల్లో ఎండీటీ టీమ్ 1 నుంచి డీజీఎం (ఐఈడీ) రాజన్న, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఏజీఎం (ఈ ఎం) రమణ రావు, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం (సేఫ్టీ) విజయ్ కుమార్, హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు. టీమ్ 2 నుంచి ఈఈ (ఐఈడీ) సాయి కిరణ్, పీఈ (ఐకె ఓసీ) కృష్ణారావు, డీవైఎఫ్ఎం (ఫైనాన్స్) నరేష్, అడిషనల్ మేనేజర్ (ఎస్టేట్స్) మహేష్, అడిషనల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) అమర్ నాథ్, డీవైపీఎం (పర్సనల్) రాజేష్‌లతో పాటు ఐకె గ్రూప్, వర్క్‌షాప్, స్టోర్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు

నస్పూర్, మే 22, ప్రభాతవార్త

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండలం తీగల్‌పహాడ్‌లోని గోదామును ఏసీఎస్ఓ వేణుగోపాల్, నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దోబీఘాట్ లేక రజకులు కులవృత్తిని చేసుకోలేకపోతున్నారు

### - కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్ శివకృష్ణ

చెన్నూరు, మే 22, ప్రభాతవార్త

దోబీఘాట్ లేకపోవడంతో రజకులు తమ కులవృత్తిని చేసుకోలేక పోతున్నారని చెన్నూరు 18 వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో రజకులు తమ కులవృత్తి చేసుకోని బ్రతకడానికి సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కౌన్సిలర్ శివకృష్ణ అన్నారు. రజకుల సౌకర్యార్థం చెన్నూరులో దోబీఘాట్ కు స్థలం కేటాయించి నిధులు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను కలిసి వినతిపత్రం అందిచామని ఆయన పేర్కొన్నారు.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణను

# అందరి భాగస్వామ్యంతో అమలు చేయాలి

### ✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





నస్పూర్, మే 22, ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక మంచిర్యాల జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, చెన్నూర్, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్లు పద్మ, స్వాతి, సంధ్యారాణి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్లను అర్హత మేరకు లబ్ధిదారులకు లాటరీ పద్ధతిన పారదర్శకంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించడం జరుగుతుందని, త్వరలో ప్రభుత్వం 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పింఛనుదారుల జీవన ప్రామాణికరణ ప్రక్రియ కొనసాగుతుందని, నూతన పింఛన్ల కొరకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకంలో అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు వివిధ వ్యాపార రంగాలలో రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా, రైతు బీమా పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, వ్యవసాయ సాగు ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అదనంగా రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులు నిర్మించుకున్న ఇండ్లకు దశల వారీగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, ఎవరికైనా బిల్లులు పెండింగ్ లో ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని, నిరుపేదలు గౌరవంగా జీవించడం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు నగదు అందించడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, నీటి సరఫరా లో ఏదైనా సమస్య ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్య రంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, ప్రాథమిక పాఠశాల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, పిల్లలలో పోషకాహార లోపాన్ని నియంత్రించేందుకు ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దండేపల్లి, చెన్నూర్ మండలం సోమనపల్లి, బెల్లంపల్లి మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేసి ఒక్కొక్క పాఠశాల 200 కోట్ల రూపాయల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ పాఠశాలల ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి బీమా సదుపాయం కల్పించేలా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా దివ్యాంగులకు మోటరైజడ్ వాహనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో పంట మార్పిడి విధానము ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి వ్యాపార, వాణిజ్య పంటలతో పాటు కూరగాయల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని, ఈ అంశాలపై రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీరు

ఆసిఫాబాద్, మే 22, ప్రభాతవార్త :

జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటునట్లు అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్ అన్నారు. శుక్రవారం న్యూ డిల్లీ నుండి కేంద్ర జల శక్తి, గృహ నిర్మాణ పట్టణ వ్యవహరల శాఖా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని విడియో కాన్ఫరెన్స్ హాలునుంచి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఇంటింటికి సురక్షతమైన త్రాగు నీరు అందించడం, గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా గ్రామీణభివ్రుద్ధి శాఖ అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి లక్ష్మి నారాయణ, మిషన్ భగిరథ ఈఈ సిద్దిఖ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్

## ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏల నిరవధిక సమ్మె

సారంగాపూర్, మే 22, ప్రభాతవార్త:



మండల కేంద్రంలో వీవోఏలు నిరవధిక సమ్మెకు దిగారు. మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న తాము సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు సారంగాపూర్ మండల వీవోఏ కమిటీ ప్రతినిధులు దొడ నరేష్, మండల అధ్యక్షురాలు లక్ష్మి తెలిపారు. ఈ మేరకు డీఆర్డీఏ, ఐకేపీ, వీవోఏల ఆధ్వర్యంలో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదని, తమకు ఉద్యోగ భద్రత కల్పించి, అర్హులైన వీవోఏలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దీప, కోశాధికారి మమత, గంగామణి, నవనీత, సునయన, భోజన్న, రమా, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**- కార్మికుల కనీస వేతనాలు పెంపు హర్షనీయం... : ఐఎన్టియుసి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్...**

**తాండూర్, మే 22, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పక్షపాతి అని మరోసారి నిరూపించుకుందని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరే విధంగా కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ జన ప్రసాద్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయంతో కార్మికులకు న్యాయం జరిగిందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని అన్ని రంగాల్లో మోసం చేసిందన్నారు. జనప్రసాద్ ఛైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వారికి అందుతున్న వేతనాలు వాటి సవరణలపై దృష్టి సారించి ప్రభుత్వానికి నివేదికలు అందించడం జరిగిందన్నారు. తదనుగుణంగానే ప్రభుత్వం కార్మికులకు లబ్ధిచేకూరేలా వేతన పెంపు నిర్ణయం తీసు తీసుకుందన్నారు. సింగరేణి గత ఎన్నికల్లో ఏఐటీయూసీ, టిబీజీకేఎస్ అక్రమ పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో గెలుపొందిన నాటినుంచి ఈ రెండున్నర సంవత్సరాల్లో కార్మికుల సమస్యలపై తీవ్ర నిరక్ష్య వైఖరిని అవలంబించింద న్నారు. నేడు మళ్ళీ ఎన్నికల సమీపిస్తున్న వేళ ఈ రెండు యూనియన్లు కొత్త నాటకానికి తెరలేపాయని, కార్మిక సమస్యల కోసం పోరాడుతున్నట్లు నటిస్తూ కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నయని ఆరోపించారు. ఆ సంఘాలు సమ్మెలు, ధర్నాలు, ఉద్యమాలు అంటూ మరోసారి కార్మిక వర్గాన్ని మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయనీ, కార్మికులు వారి కుట్రలను తిప్పి కొట్టాలనీ పిలుపునిచ్చారు. టిఆర్ఎస్ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత గతంలో టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలుగా ఉన్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీసుకుందని అప్పుడు స్పందించని ఆమె నేడు నూతన గనులు తీసుకువస్తామని కార్మిక హక్కులను కాపాడుదాం అని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐఎన్టియుసి కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో యాజమాన్యం డ్యూటీ షిఫ్ట్ వేళలు మార్చి కార్మికులకు ఉపశమనం కల్పించేలా చూడాలన్నారు. బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా యాజమాన్యం చొరవ తీసుకోవాలన్నారు. సింగరేణి మనుగడకు కొత్త గనులే ఆధారమని బెల్లంపల్లి ఏరియాలో గోలేటి మహావీర్ కానీ ఓపెన్ కాస్ట్ లు ఏర్పాటుకు యాజమాన్యం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్మిక హక్కుల సాధన ఐఎన్టీయూసీ తోనే సాధ్యమని ఐఎన్టీయూసీ సాధించిన హక్కులను కూడా తామే సాధించినట్టుగా ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాబోయే రోజుల్లో ఐఎన్టీయూసీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్మిక లోకం అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శులు మాధవ కృష్ణ, చంద్రకుమార్, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి మాసాడి నారాయణ, కైరిగూడ కార్యదర్శి భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్టియూసి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి-కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం

**క్యాతన్‌పల్లి, మే 22, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలో 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరే విధంగా కనీస వేతనాలను పెంచినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కార్మిక, శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ల చిత్రపటాలకు శుక్రవారం సూపర్ బజార్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో క్యాతనపల్లి మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ కార్మికులతో కలిసి నాయకులు పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అవుట్ సోర్సింగ్ కార్మికులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్మికులకు న్యాయం చేస్తూ దాదాపు 12 సంవత్సరాల తర్వాత కనీస వేతనాలను సవరించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ లు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా కనీస వేతనాలు పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువు ఖర్చులు, వైద్య ఖర్చులు రోజురోజుకు పెరిగిన కార్మికుల వేతనాలు మాత్రం పెరగకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ముఖ్యంగా అవుట్ సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికులు తక్కువ వేతనాలతో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల సమస్యలను గుర్తించి, ఎన్నికల హామీ మేరకు కనీస వేతనాల పెంపుపై చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కార్మికుల సంక్షేమాన్ని ప్రాధాన్యతగా తీసుకుని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కార్మికులకు సరైన వేతనాలు అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మిక పక్షపాతి ప్రభుత్వంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల రాజయ్య, కాసర్ల ప్రకాష్, మంద సృజన, ప్రధాన కార్యదర్శులు బత్తుల వేణు, మేకల సురేందర్, ఏల్పుల సత్యనారాయణ, అధికార ప్రతినిధి మాదాసు రాజ్ కుమార్, కార్యదర్శులు కూనారపు శివ కుమార్, పైడాకుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్ గౌడ్, పోగుల లచ్చులు, నర్సయ్య, మహిళా నాయకులు రాజేశ్వరి, దీప, పుష్ప, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**జైపూర్, మే 22, ప్రభాతవార్త**

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచిన సందర్భంగా జైపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు విశ్వంబర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వర్మని నవీన్ మాట్లాడుతూ వేతనాల పెంపుతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగు నింపిందని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి కార్మిక పక్షపాతి ప్రభుత్వం అని రుజువు చేసుకుందని అన్నారు. ఈ పెంపుతో కార్మిక కుటుంబాలకు ఆర్థిక భద్రతతో పాటు ఆత్మగౌరవం కూడా వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విశ్వంబర్ రెడ్డి, డిసిసి వైస్ ప్రెసిడెంట్ రిక్కుల శ్రీనివాస్ రెడ్డి మండల వైస్ ప్రెసిడెంట్ సుంకర శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శులు మంతెన లక్ష్ముణ్, వేముల రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సెక్రటరీలు గుడుగుల సాగర్ వేముల సతీష్ గౌడ్ జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్ ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ అంబాల సంపత్ రెడ్డి అంబాల రవి బత్తుల శ్రీనివాస్ యాదవ్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హాస్పిటల్ సతీష్ కుమార్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.



## దళిత వర్గాల ఉన్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి మాదరి భాగ్యరెడ్డి వర్మ

**- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, మే 22, ప్రభాతవార్త:**

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం మాదరి భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొని, పలువురు అధికారులతో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తొలగించేందుకు జీవితాంతం పాటుపడిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. దళిత బాలికల కోసం నాటి నిజాం కాలంలోనే 26 పాఠశాలలను స్థాపించారని గుర్తుచేశారు. కుల వివక్షత నిర్మూలన, మూఢనమ్మకాలపై చైతన్యం, దేవదాసీ వ్యవస్థ నిర్మూలన, మద్యపాన నిషేధం, బాలికల విద్య వంటి అనేక విషయాల్లో ప్రజలను చైతన్యం చేశారని వివరించారు. ఆది హిందూ సోషల్ లీగ్ సంస్థను ఏర్పరిచి జాతుల మధ్య అంతరాలు తొలగించారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిస్తూ, నేటి యువత ఆయనను మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో విశిష్ట మార్పులకు కృషిచేసిన మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గొప్ప వ్యక్తుల విశేషాలను నేటి తరాలకు అందించినవారమవుతామని చెప్పారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, సీపీవో జీవరత్నం, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, జిల్లా పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాదరి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా




## క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**- ముగిసిన సింగరేణి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు**

**నస్పూర్, మే 22, ప్రభాతవార్త**

శిక్షణ పొందిన బాలబాలికలు భవిష్యత్తులో ప్రతిభావంతమైన క్రీడాకారులుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి సింగరేణి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో ఏప్రిల్ 25 నుండి మే 20 వరకు 25 రోజుల పాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. ముగింపు వేడుకలకు మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పూర్తి చేసుకున్న 110 మంది బాలబాలికలకు క్రీడా దుస్తులను అందజేశారు. వేసవి సెలవుల్లో కార్మికుల పిల్లలు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం ఈ క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ప్రగతి స్టేడియం, ప్రాణహిత స్టేడియం, మనోరంజన్ సముదాయంలో ఈ శిక్షణ కొనసాగింది. శిబిరంలో పాల్గొన్న బాలబాలికలకు ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్ విభాగాలలో నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మానసిక ఉల్లాసం కోసం సింగరేణి సంస్థ ప్రతి ఏరియాలో పెద్ద సంఖ్యలో పార్కులు, స్టేడియంలు, క్లబ్బులు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్ములు, ఇతర క్రీడా వినోద వసతులను ఏర్పాటు చేస్తోంది. సంస్థ కల్పిస్తున్న ఈ వసతులను ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం నాయకుడు చంద్రమోహన్, డీజీఎం పర్సనల్ డాక్టర్ ఎస్. అనిల్ కుమార్, క్రీడల గౌరవ కార్యదర్శి కె. సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ సకినాల నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ టి. సురేష్ పాల్గొన్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

### - సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం

**తాండూర్, మే 22, ప్రభాతవార్త :**

రైతుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సిపిఎం మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, అన్నారు. తాండూర్ మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని అమ్మడానికి రైతులు రాత్రనకా పగలనకా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోదాములు వద్ద గోనె సంచులు, లారీలు, హమాలీల కొరత వలన రైతులు ధాన్యం అమ్మడానికి, తరలించడానికి అరి గోశపడుతున్నారని ఆరోపించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నాన్నయ్య, రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు

## పీవీటిజిల సమస్యలపై గ్రామసభలో తీర్మానం

**తాండూర్, మే 22, ప్రభాతవార్త :**

మండలంలోని నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ మడావి ప్రభాత్ రావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. జన్ జాతీయ గరిమ ఉత్సవ్ 2026 జన్ భాగీదరి అభియాన్ కార్యక్రమంలో భాగంగా అబ్బాపూర్, వాసాలమడ గ్రామాలకు చెందిన అర్హులైన పీవీటిజిల సంక్షేమం, అభివృద్ధి పథకాలు, ఆధార్, పోడు భూముల పట్టాల సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని గ్రామసభలో చర్చించి తీర్మానించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్యామ్ రావు, ఉపసర్పంచ్ పర్వతరావు, పంచాయతీ సెక్రెటరీ జగదీష్, వార్డ్ సభ్యులు, ఏఎన్ఎం , అంగన్వాడీ టీచర్స్, గ్రామ పటేళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాండూర్ ఐబిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**తాండూర్, మే 22, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబీలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ తెలంగాణలోని 1.11 కోట్ల కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద బోయిన శంకర్, తాళ్లపల్లి శంకర్ గౌడ్, నవీన్ పటేల్, పుట్ట శ్రీనివాస్, కటకల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

# పోలీస్ విభాగం సమన్వయంతో సింగరేణి ఆస్తులను రక్షించాలి

### - శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో చీఫ్ సెక్యురిటీ ఆఫీసర్ బాలరాజు క్షేత్రస్థాయి తనిఖీలు

### - స్క్రాప్ దొంగతనాల నియంత్రణకు పటిష్ట వ్యూహాలు అమలు చేయాలని ఆదేశం

**నస్పూర్, మే 22, ప్రభాతవార్త**

సింగరేణి సెక్యూరిటీ విభాగం, పోలీస్ విభాగం సమన్వయంతో సంస్థ ఆస్తులను రక్షించాలని సింగరేణి చీఫ్ సెక్యురిటీ ఆఫీసర్ (కార్పోరేట్) బాలరాజు ఆదేశించారు. సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యురిటీ విభాగం పనితీరు పరిశీలనలో భాగంగా శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. శ్రీరాంపూర్ సెక్యురిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, భద్రతా సిబ్బందితో కలిసి వివిధ గనుల్లో క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను బాలరాజు క్షుణ్ణంగా పరిశీలించారు. సింగరేణి సంస్థకు చెందిన విలువైన ఆస్తులు, ఇనుప స్క్రాప్, ఇతర పాత యంత్రాల పరిరక్షణకు తీసుకుంటున్న రక్షణ చర్యలను ఈ సందర్భంగా సమీక్షించారు. స్క్రాప్ దొంగతనాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంగా ఈ నెల మొదటి వారంలో బెల్లంపల్లి రీజియన్ సెక్యురిటీ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశ నిర్ణయాల కొనసాగింపుగా ఈ క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. పోలీస్ విభాగం సమన్వయంతో స్క్రాప్ దొంగలను పట్టుకోవడం, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం ద్వారా శిక్షలు పడేలా చూసి దొంగతనాలను నియంత్రించే వ్యూహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శ్రీరాంపూర్ ఏరియా సెక్యురిటీ సిబ్బందితో కలిసి ఆర్.కె 7, ఆర్.కె న్యూ టెక్, ఎస్ఆర్‌పీ 1, ఎస్ఆర్‌పీ 3 గనుల పరిసరాలలో చీఫ్ సెక్యురిటీ ఆఫీసర్ కలియతిరిగారు. అక్కడ ఉన్న విలువైన ఇనుప సామాగ్రి, పాత యంత్రాలు, ఇతర విలువైన పరికరాలను పరిశీలించి వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనుల సరిహద్దులలో విలువైన వస్తువులు ఉన్న చోట కంచెలు, ట్రెంచ్ ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా సింగరేణి సెక్యూరిటీ విభాగం ఎస్అండ్‌పీసీతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అంకితభావంతో కృషి చేయాలని బాలరాజు స్పష్టం చేశారు. భద్రతా లోపాలు లేకుండా నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సెక్యురిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, షిఫ్ట్ ఇన్స్పెక్టర్ శంకర్, ఇతర సెక్యురిటీ సిబ్బంది పాల్గొన్నారు.


గనుల్లో భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న సింగరేణి చీఫ్ సెక్యురిటీ ఆఫీసర్ బాలరాజు

## వరి ధాన్యం అన్ లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### - బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్

**తాండూర్, మే 22, ప్రభాతవార్త**



గోదాములలో వరి ధాన్యం అన్లోడ్ ప్రక్రియను వేగవంతముగా నిర్వహించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. మండలంలోని కార్తికేయ రైస్‌మిల్లును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి కొనుగోలు చేసిన వారి ధాన్యాన్ని కేటాయింపు ప్రకారం రైస్ మిల్లులకు గోదాములకు సకాలంలో తరలించాలని. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.సబ్ కలెక్టర్ వెంట తహసిల్దార్ జ్యోత్స్న, గిర్దావర్ పద్మజ, సిబ్బంది ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

## మహిళల భద్రతపై షీటీం ఆధ్వర్యంలో అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, తమే 22, ప్రభాతవార్త :**

మండలం ఎస్జీవోస్ కాలనీలోని ఇందిరా క్రాంతి పథకం మహిళలకు షీ టీమ్ ఇన్చార్జి సునీత, షీ టీమ్ బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. మహిళల భద్రత, చిన్నపిల్లల రక్షణ, లింగ సమానత్వం,సైబర్ నేరాలు,బాల్య వివాహాల నివారణ వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీస్ సహాయం పొందేందుకు డయల్ 100, 112 సేవలతో పాటు 1930 (సైబర్ మోసాల హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఏ రాజేష్, డి.విటల్ ఎం.సరిత, షీ టీమ్ సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.



## భాగ్యరెడ్డి వర్మ జీవితం స్ఫూర్తిదాయకం

**ఆసిఫాబాద్, మే 22, ప్రభాతవార్త :**

సామాజిక సంస్కర్త, అసమానతలపై పోరాడిన స్ఫూర్తియుత భాగ్యరెడ్డి వర్మ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, జిల్లా రెవెన్యూ అధికారి వేణులతో కలిసి అదనపు కలెక్టర్ హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ హిందూ స్థాపన స్థాపించి ఎన్నో సామాజిక మార్పులు తెచ్చారని, అనగారిన వర్గాల అభ్యున్నతి, మహిళల విముక్తి కోసం ఆయన చేసిన పోరాటం, నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యాభివృద్ధి కోసం పాఠశాలలు నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపట్టారని, వారి జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం

**ఆసిఫాబాద్ టౌన్, మే 22, ప్రభాతవార్త :**



బాలల హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సంక్షేమ అధికారి స్వరూప రాణి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాల రక్షా భవన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలు, పోక్సో కేసుల పరిష్కారం, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై డీసీపీవో బి. మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై జరుగుతున్న వేధింపుల నిర్మూలనకు శాఖ సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు. ప్రతి బాలుడు సురక్షితమైన వాతావరణంలో ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా బాలల సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక పరిస్థితుల్లో ఉన్న బాలలకు తక్షణ సహాయం అందించేలా చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాల రక్షా భవన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.